వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు

ఆందోళనలో వరి, మామిడి రైతులు



రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో రాశులుగా పోసిన ధాన్యాన్ని బరకాలు కట్టి ఒబ్బిడి చేసుకున్న రైతులు



మొగల్తూరులో దిగుబడిలేని మామిడి తోట

మొగల్తూరు: వాతావరణంలో అకాల మార్పులు కారణంగా ఏ నిమిషాన ఎలా ఉంటుందో? తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న మూడు రోజులు పాటు తేలికపాటి వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ముందు జాగ్రత్తగా తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. గురవారం వేకువ జాము నుంచి చిరుజల్లులు పడడంతో రైతులు పొలాల్లోని కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని రాశులుగా పోసి గడ్డికప్పి, గాలికి ఎగురుకుండా బరకాలతో కట్టారు. మండలంలోని సుమారు 1192 ఎకరాల్లో దాళ్వాసాగు చేపట్టగా ముందుగా 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. మిగిలిన రైతులు వాతావరణంలో మార్పులు కారణంగా ఆలస్యంగా నాట్లు వేసుకోవడంతో దిగుబడి రావడం ఆలస్యమైంది. ముందుగా ఊడ్చిన రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోగా ఆలస్యంగా ఊడ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రామన్నపాలెం, మొగల్తూరు, శేరేపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లోని రైతులు కోసిన ధాన్యాన్ని తేమ శాతం లేకుండా రహదారులు లేదా చేలల్లోని కళ్లాలోనూ ఆరబెట్టుకున్నారు. అయితే వాతావరణ శాఖ హెచ్చరికలతో కళ్లాలు, రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోట ప్రాంతంలోని రైతులు తమ ధాన్యాన్ని రాశులుగా పోసి బరకాలు కప్పి గాలి వేసినా ఎగరకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. మరో వారం రోజులు పాటు వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.

దిగుబడి లేక మామిడి రైతుల దిగాలు

మరోవైపు ఈ ఏడాది మామిడి రైతులు దిగుబడి లేక ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గతేడాది వర్షాలు తక్కువగా ఉండడంతో దాని ప్రభావ ఈఏడాది మామిడిపై పడింది. మండలంలో పేరుపాలెం, కేపీ పాలెం, మొగల్తూరులోని కొన్ని ప్రాంతాలు మినహా ప్రత్యేకంగా తోటలుండవు. కొబ్బరి తోటల్లోనూ, లేదా ఇంటి పెరట్లోనూ, లేదా జీడితోటల్లోనూ అంతర్గతంగా మామిడి చెట్లు ఉంటాయి. సుమారు 600 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నట్లు అధికారులు అంచానా. అయితే మామిడిపూతను బట్టి తోటలు లీజుకు తీసుకుని కాయ దిగుబడి వచ్చిన తరువాత కాయలు అమ్ముకుని లీజుకు తీసుకున్న రైతు ఆర్థికంగా గట్టెక్కుతాడు. అయితే ఈ ఏడాది ముందుగా పూతను చూసి లీజుకు తీసుకున్న రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

అధ్వానంగా పంట కాలువ



చెత్తతో పూడుకుపోయిన చినమామిడిపల్లి వద్ద పంటకాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్త పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కక్కడ చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందిగా మారింది. గత ఏడాది వేసవిలో కాలువలు కట్టేసి నీరు వదిలిన తరువాత కాలువను శుభ్రం చేయలేదు. ఈ వేసవిలోనైనా కాలువ బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరాన్ని వినియోగించుకోవాలి



ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరంలో ఇంటికి వెళ్లి క్యాన్సర్ రోగిని పరీక్షిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.సత్య సౌజన్య కోరారు. మండలంలోని నాగరాజుపేటలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 184 మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. 9 మంది గర్భిణులు, 5గురు బాలింతలను పరీక్షించారు. బీపీ, సుగర్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు ఝాన్సీ, ప్రసన్న, ఏఎన్ఎం సరళ, డీఈఓ సురేష్ పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం



రోగికి సహాయం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఆపన్నులను ఆదుకోవడంలో నిజమైన సంతృప్తి ఉంటుందని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన వి.ప్రసాద్ అనే వ్యక్తి శస్త్ర చికిత్స చేయించుకుని పేదరికంతో బాధపడుతున్నారు. దీంతో మావనత సంస్థ తరుపున రూ.10వేలు నగదు, బియ్యం బస్తా, నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి మద్దాల వాసు, సభ్యులు బొక్కా గంగాధర్, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, పెన్మెత్స నాని పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి రూ.10 వేలు వితరణ



కిడ్నీ రోగికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సహాయాన్ని గురువారం యలమంచిలి మండలం ఇలపకుర్రులో కిడ్నీ రోగి బొక్కా వేణుగోపాలస్వామికి ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరదరాజ స్వామి కల్యాణం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో వేంచేసియున్న అతి పురాతన వరద రాజాస్వామి ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామిశెట్టి సూర్య ప్రసాద్ దంపతులు పాల్గొన్ని శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చైర్మన్ సూరి ప్రసాద్ చెప్పారు.

వేల్పూరులో వేసవి శిక్షణ కార్యక్రమాలు

తణుకు టౌన్ : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, చెప్పించడం, పుస్తక సమీక్ష కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైకుంఠపాళీ ఆటను వివరించి ఆడించారు. రీసోర్సు పర్సన్ ఎల్ వెంకటరమణ, జి. బసవేశ్వరరావు, వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

నరసాపురం: నరసాపురం ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున తేలికపాటి వర్షంపడింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షంతో పాటు సాయంత్రం వరకూ వాతావరణం మేఘావృతం కావడంతో కొన్ని రోజులుగా విపరీతమైన ఎండ, ఉక్కబోతలతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. కొన్ని రోజులుగా ఎండలతో మధ్యాహ్నం పూట జనసంచారం లేక వెలవెలబోయిన మార్కెట్ ప్రాంతం జనంతో కళకళలాడింది. మరో రెండు రోజులపాటు ఇదే రకమైన పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ తెలపడంతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వాతావరణంలో అకాలమార్పుతో తీరంలో ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు.

మందాలమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు ఆకాశపు సాయికృష్ణ, ఆకాశపు వీవీ సత్యవతి, కాపిశెట్టి ధనప్రసాద్‌లు రూ.25,116 విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయం వద్ద విరాళాన్ని అందించారు. లయాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు అడవిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ పాలకొల్లు టౌన్ 1 ఫీడర్ మరియు 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ స్కీంలో కొత్త లైన్లు ఏర్పాటు, ట్రీ కటింగ్ పనులు నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని స్పష్టం చేశారు. అందువల్ల శంభునిపేట, బంగారువారి చెరువు గట్టు, బ్రాడీపేట, పెద్ద పోస్టాఫీసు, వెంకటేశ్వర కాలనీ, బ్యాంకు స్ట్రీట్, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

ఉరుకులు పరుగులు



తామరాడలో బరకాలు కప్పి రక్షించుకుంటున్న రైతన్నలు



తామరాడలో ఆరబెట్టుకొన్న ధాన్యం



రామన్నపాలెంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

పెనుగొండ: ఒక్కసారిగా వాతావరణం మారి వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో ఇప్పటికే అత్యధికం ధాన్యం అమ్మకాలు పూర్తయ్యాయి.శివారు ప్రాంత రైతన్నలు ఇంకా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాల్సి ఉంది. రెండు రోజులుగా వాతవరణం మారి అప్పుడపుడు వర్షం పడుతుండడంతో ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెడతున్నారు. నియోజకవర్గంలో రైతుల ఆచంట మండలంలో 53 శాతం, పోడూరులో 71 శాతం, పెనుమంట్రలో 67 శాతం, పెనుగొండలో 78 శాతం ధాన్యాన్ని అమ్మకాలు పూర్తి చేసి మిల్లులకు చేర్చారు. ఇటీవలే ఎన్నికలు కావడంతో వారం రోజుల పాటు ధాన్యం ఎగుమతులు మందగించాయి. ఎన్నికలు పూర్తి కావడంతో 14 నుంచి రైతులు ధాన్యం ఒబ్బిడి చేయడంలో నిమగ్నమయ్యారు. అయితే రైతులు అందరూ ఒకేసారి ఒబ్బిడి చేయడంలో నిమగ్నం కావడంతో సంచుల కొరత వెంటాడుతుంది. రెండు రోజులుగా సంచులు కోసం మిల్లుల వద్ద, అధికారుల వద్ద బారులు తీరుతున్నారు. పూర్తిస్థాయిలో వారి వద్దకు సంచులు చేరుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంతమేర సంచులు దొరికినా ఒక్కసారిగా వాతావరణం మారి ఆకస్మాత్తుగా వర్షం పడుతుండడంతో ధాన్యం బస్తాలు వర్షార్పణం అవుతున్నాయి. రాశుల మీద ఉన్న ధాన్యం సైతం తడుస్తుంది. దీంతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు చినుకుల పడకుండా ఉంటే రైతులు ఒబ్బిడి అయ్యే అవకాశాలు ఉన్నాయి.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ప్రారంభమైంది. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరాన్ని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినిమిల్లి మాట్లాడుతూ విద్యార్థులకు, పిల్లలకు ఉపయోగపడేలా ప్రతి ఏటా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పుస్తకాలు చదివే అలవాటు విద్యార్థులు పెంపొందించుకోవాలని చెప్పారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ ఈ శిబిరంలో పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసంపై ఉపన్యాసాలు ఇప్పించడం, చిన్నపిల్లలకు ఆటపాటలు ఉంటాయని చెప్పారు. జూన్ 7 వరకూ శిబిరం కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



పెనుగొండలో మూలవిరాట్ వాసవీ మాతకు కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాల సందర్భంగా పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గురువారం లక్ష కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి నగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, మహిషాసుమర్దనీ, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లకు కుంకుమ పూజలను రామడుగుల శ్రీ నరిసింహమూర్తి, కోట వెంకట సుబ్రహ్మణ్యంల పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం మూల విరాట్ వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. వాసవీ గీత మహిళా సమాజం ఆధ్వర్యంలో మహిళలు వాసవీ పురాణం పఠించారు.

నేడు 102 కన్యకల పూజ

వాసవీ మాత జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వాసవీ మాతకు 102 కన్యల పూజ నిర్వహించనున్నారు. అనంతరం లక్ష మల్లికా పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి ఏర్పాటు చేశారు. 102 కన్యల పూజలో పాల్గొనే భక్తులకు ఆలయ శాశ్వత నిత్యాన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం



పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు పీహెచ్‌సీలో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ దృశ్యం

పాలకొల్లు అర్బన్: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ కోరారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇడిస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా డెంగీ వ్యాధి ప్రబలుతుందని ఈ వ్యాధి సోకిన వారికి విపరీతమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, వికారం, రక్త కణాలు తగ్గడం, ఒంటి మీద దద్దుర్లు, కనుగుండ్లు ఎర్రబడుట తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి తీవ్ర దశలో రక్తనాళాలు చిట్లడం వల్ల కళ్ల నుంచి రక్తం కారుతుందని, పంటి చిగురు నుంచి, విరోచనం ద్వారా రక్తం కారుతుందన్నారు. ఈ వ్యాధి తీవ్ర దశకు చేరక ముందే దోమలు పెరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అలాగే ప్లాస్టిక్ కుండీలు, కొట్టిపడేసిన కొబ్బరి బొండాలు, డ్రమ్ముల్లోనూ, పూలకుండీల్లో, ప్లాస్టిక్ వస్తువుల్లోనూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ ప్రతాప్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమలేశ్వరరావు, జి.ఉదయచంద్ర, కె.బాలచంద్రుడు, డి.కమల తదితరులు పాల్గొన్నారు.

గడ్డికి యమ డిమాండ్



వరి చేలలో గడ్డిని వరిమోపులుగా కట్టిన దృశ్యం

పాలకోడేరు: మారుతున్న కాలంలో పెరిగిన సాంకేతికత వల్ల వ్యవసాయరంగంలో కీలకమార్పులు వచ్చాయి. ఫలితంగా పశువులకు ఎండు గడ్డి కొరత ఏర్పడుతుంది. గతంలో మనుషులతో వరి పంటను కోసి, ట్రాక్టర్లతో నూర్పించేవారు. అప్పుడు ఎండు గడ్డి పుష్కలంగా లభించేది. దాన్ని పశుగ్రాసంగా ఉపయోగించుకునేవారు. అయితే మారుతున్న కాలంతో మనుషుల కూలీరేట్లు విపరీతంగా పెరగడం వల్ల, మనుషులతో రోజంతా చేయించే పని వరి కోత మెషీన్లతో గంటల వ్యవధిలోనే పూర్తయ్యి సమయం కలిసి రావడం వల్ల రైతులంతా యంత్రాల బాట పడుతున్నారు. ఫలితంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దాణా ఖర్చులు తట్టుకోలేక మెషీన్ ద్వారా కోసిన గడ్డిని, యంత్రాల ద్వారా మోపులుగా చుట్టించి, పశువులకు కావలసిన ఎండు గడ్డిని సమకూర్చుకుంటున్నారు. ఇలాంటి మోపులను 35 రూపాయలు చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎకరా గడ్డి 8 నుంచి 10 వేల రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

అయ్యభౌబోయ్

- గ్రామాలలో కుక్కల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు



వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

యలమంచిలి: గ్రామాలలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు ప్రజలపై దాడి చేసి కరుస్తుండుటతో బెంబేలెత్తుతున్నారు. గతంలో పంచాయతీ అధికారులు కుక్కలను పట్టుకుని చంపేవారు. బ్లూక్రాస్ సంస్థ ఆంక్షలతో కుక్కలను చంపడం మానివేసి పట్టుకుని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి వదిలేసి వచ్చేవారు. కానీ అది కూడా అధిక వ్యయ ప్రయాసలతో కూడిన పని కావడంతో ఈ మధ్య కాలంలో కుక్కలు పట్టుకోవడం మానేశారు. దీంతో గ్రామాల్లోకుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో కుక్క కాటుకు గురయ్యే వారు కూడా ఎక్కువయ్యారు. ఏ గ్రామంలో చూసిన వందల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. యలమంచిలి మండలంలోని యలమంచిలిలంక, శిరగాలపల్లి, యలమంచిలి, చించినాడ గ్రామాలలో కుక్కలతోపాటు కోతుల బెడద కూడా ఎక్కువగా ఉంది. ఈ గ్రామాలలో వందల సంఖ్యలో కోతులు కూడా సంచరిస్తున్నాయి. వారంలో కనీసం పది మంది కోతి దాడికి గురయిన వ్యక్తులు యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నట్లు ఫార్మాసిస్ట్ మేడికొండ రామదాసు చెప్పారు.

20 రోజులలో 600 కేసులు

నూతన పశ్చిమ గోదావరి జిల్లాలో మే 1 నుంచి గణాంకాలు పరిశీలిస్తే మొత్తం 595 మంది జంతువుల కాటుకు గురయినట్లు తెలుస్తోంది. జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 18 అర్బన్ పీహెచ్‌సీలు, 8 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల నుంచి ఈ నెలలో (మే ఒకటి నుంచి 15వ తేదీ వరకు) జిల్లా వైద్య శాఖాధికారి కార్యాయానికి వచ్చిన నివేదికల ప్రకారం 507 మంది కుక్క కాటుకు, 36 మంది పాము కాటుకు 52 మంది ఇతర జంతువుల కాటుకు గురయినట్లు రికార్డ్ అయ్యింది. అంటే జిల్లాలో సరాసరిన రోజుకు 20 మంది జంతువుల కాటుకు గురవుతున్నారు. కుక్క కాటుకు వేసే ఏఆర్‌వీ (యాంటీ రాబిస్ వ్యాక్సిన్) ఇంజక్షన్‌లనే కోతి కాటుకు కూడా వేస్తారు. పాము కాటుకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వ్యాక్సిన్) వేస్తారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులో ఈ రెండు రకాల వ్యాక్సిన్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. దీని వల్ల ప్రజలకు సత్వరమే వైద్యం అందుతుంది. అయితే జంతువుల కాటుకు వైద్యం అందించడం కంటే వాటిని నిరోధించడం ప్రధానమని ప్రజలు కోరుతున్నారు.